వ్యాపకం

- సి. జయపాక్ రెడ్డి



ఆదివారం పొద్దున్నే పేపరు తిరగేస్తుండగా మోహన్‌రావు 'నమస్కారం సార్' అంటూ వచ్చాడు.

'నమస్కారం... కూర్చోండి' అంటూ ఎదురుగా వున్న కుర్చీ చూపించాను. మా ఇంటికి రెండిళ్లవతల వున్న మోహన్‌రావు అప్పుడప్పుడూ వచ్చి కన్నవీ, విన్నవీ చెబుతుంటాడు. మా కాలనీ విషయాలన్నీ నాకు తెలిసేది మోహన్‌రావుద్వారానే. మనిషి మంచివాడే. కొద్దిగా బోళా రకం మనిషని అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది.

అవీ ఇవీ మాట్లాడుతుండగా సుమిత్ర ఇద్దరికీ టీ తెచ్చిచ్చింది.

'పై రాబడి ఏమాత్రం వుంటుంది సార్' టీ సిప్ చేస్తూ నవ్వుతూ అదోరకంగా ముఖం పెట్టి అడిగాడు మోహన్‌రావు.

పత్రికలకి కవిత్వం, వ్యాసాలు పంపుతుంటాను కాబట్టి వాటికి ఏమాత్రం వస్తుందని అడుగుతున్నాడేమోనని 'ఆ ఏమొస్తుందయ్యా... నానా కష్టపడి రచనలు పంపిస్తే యాభై, వంద పంపిస్తుంటారు. అది కాగితాల ఖర్చుకి సరిపోదు. పదిమందిలో కాస్తో కూస్తో పేరొస్తుంది తప్ప... సాహిత్య సేవకు డబ్బెవరిస్తారు' అని టీ తాగడం పూర్తిచేసి పేపర్‌లో తలదూరాను.

'దాని గురించి కాదు సార్ నేనంటోంది. మీ అదనపు రాబడి గురించి' అని ముసిముసిగా నవ్వాడు.

నాకు చిరాకేసి 'మోహన్‌రావుగారు మీకు తెలియందేముంది. మా ఆఫీసులో పైరాబడి వుండదు గదా... పైగా నేను సైడ్ వ్యాపారం ఏదీ చెయ్యడం లేదు గదా' అని కొట్టి పారేశాను.

'అదేనండీ ఇందాక అన్నారు చూడండి సాహిత్య సేవ... దానివల్ల ఎంత గిట్టుబాటవుతోందని నేనడుగుతున్నది' మోహన్‌రావు గొంతులో కొద్దిగా వ్యంగ్యం ధ్వనించింది.

'ఏమిటి మీరనేది?'

'అబ్బే నేనంటున్నది కాదండీ... అందరూ అనుకునేదే...' నీళ్లు నమిలాడు.

'ఏమనుకుంటున్నారు?'

'అదేనండీ... మీరు తరచుగా చారి నిర్వహించే అన్ని సాహితీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుంటారు కదా- చారి మీకు చాలా సన్నిహితుడు కనుక- కార్యక్రమాల నిర్వహణకు వసూలు చేసే విరాళాల్లో మీకుకూడా ఋణమో, ఫణమో ముట్టజెపుతుండవచ్చునని అనుకుంటున్నారు"

మోహన్‌రావు చెప్పిన విషయం వినగానే నా ఒంట్లోంచి ఒక్కసారిగా స్వేదం తన్నుకొచ్చింది. నా ముఖం పాలిపోతున్నట్లూ, రక్తం ఇంకిపోతున్నట్లూ అనిపించింది. ఊహించని విషయం వినేసరికి నాకు నోట మాటరాకుండా పోయింది.

'కొత్త విషయం చెప్పినందుకు థాంక్సండీ మోహన్‌రావుగారు- కానీ నాకు అలాంటి సంపాదన ఏదీ లేదండి' అని మాత్రం అనగలిగాను.

★★★

మా ఊళ్లో సరాసరి పదిహేనురోజులకోసారి సాహితీ కార్యక్రమం, నెలకొక సాంస్కృతిక కార్యక్రమం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. దాదాపుగా సాహిత్య కార్యక్రమాలన్నీ 'సాహితీ మైత్రి' సంస్థ ఆధ్వర్యంలోనే జరుగుతాయి. ఎప్పుడో ఒకసారి సాంస్కృతిక కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తుంది సాహితీ మైత్రి.

సాహితీ మైత్రి కార్యదర్శి చారి. చారి పూర్తిపేరు చాలా తక్కువమందికి తెలుసు. చారి అని కొందరు, సాహితీ చారి అని కొందరు పిలుస్తుంటారు. నేను ఈ ఊరికి బదిలీ అయివచ్చిన కొన్ని రోజులకు మా ఆఫీసుకు వచ్చి నన్ను కలిసి పరిచయం చేసుకున్నాడు చారి. కవిత్వంలోను, విమర్శలోను కృషి చేస్తున్నందున సాహితీ లోకంలో చాలామందికి నా పేరు సుపరిచితమే. నాకు ఈ ఊరికే బదిలీ అయిందని తెలుసుకుని వచ్చినట్లు మొదటిసారి నన్ను కలిసినప్పుడు చెప్పాడు చారి. తెలుగు సాహిత్యమంటే చెవి కోసుకునే నేను ఊళ్లో జరిగే అన్ని సాహితీ కార్యక్రమాలకు హాజరయ్యే వాడిని తర్వాతర్వాత వక్తగా, పుస్తక పరిచయకర్తగా, కవి పరిచయకర్తగా, అధ్యక్షుడిగా, అతిథిగా- ఇలా రకరకాలుగా సాహితీ సభలకు హాజరవుతూ వస్తున్నాను. చారికి నాకు కొన్ని అభిరుచులు కలవడం వల్ల- నాకంటే చిన్నవాడే అయినా- మేమిద్దరం సన్నిహితులయ్యాం. అన్ని సాహితీ కార్యక్రమాల్లో నా పేరును ఏదో రూపంలో ఆహ్వానపత్రంపై అచ్చు వేయిస్తాడు చారి.

సాహితీ మైత్రికి ఇతర కార్యవర్గ సభ్యులు వున్నప్పటికీ వారు పేరుకు మాత్రమేనని నాకు ఈ రెండేళ్లలో అర్థమైంది. అన్నీ తానే అయి కార్యక్రమాలను నిర్వహిస్తుంటాడు చారి. గ్రంథావిష్కరణ సభ అయితే ముందుగా గ్రంథకర్తను ఒప్పించడం, ముఖ్య అతిథి, అతిథులు, సభాధ్యక్షుడు, వక్తలను నిర్ణయించడం, సభాస్థలిని ఎంపిక చెయ్యడం, ఆహ్వానపత్రాలు ముద్రించి పంపిణీ చేయడం వంటి పనులన్నీ చారి ఒక్కడే చూసుకునేవాడు. ఈ పనులన్నింటితో చారి ఎప్పుడూ బిజీగా వుండేవాడు.

సమయానికి కార్యక్రమానికి వెళ్లి ఆనందించడమే మా పని. ఇలా తరచుగా కార్యక్రమాలు నిర్వహించడంవల్ల మా ఊళ్లో ఉన్నతాధికారులు, పురప్రముఖులంతా చారికి సుపరిచితం.

చారి సాహిత్య కార్యక్రమాల్ని అంకితభావంతో జరపడం చూసి నాకు చాలా ముచ్చటేసేది. బహుశా ఇది కూడా ఒక కారణం కావచ్చు చారి అంటే అభిమానం ఏర్పడటానికి. వేగవంతమైన నవనాగరికత సమాజంలో తెరమరుగవుతున్న తెలుగు సాహితీ రంగాన్ని చారి ముందుకు తీసుకెళుతున్నాడని అక్కడా ఇక్కడా అంటుండేవాణ్ణి.

సాహితీ కార్యక్రమంలోనో లేకుంటే మా ఆఫీసులోనో ఎక్కువగా చారి, నేను కలుసుకునేది. ఏ కార్యక్రమం చేపట్టేదీ, ఎవరిని అతిథులుగా పిలుస్తున్నదీ తదితర వివరాలు ఎప్పటికప్పుడు చారి మా ఆఫీసుకు వచ్చి చెబుతుండేవాడు. చారి రెండు మూడుసార్లు కంటే ఎక్కువ మా ఇంటికి రాలేదు.

మేం ఎప్పుడు కలిసినా సాహిత్యం గురించో, సాహితీ కార్యక్రమం గురించో మాట్లాడుకునేది. చారి గవర్నమెంట్ స్కూలులో టీచర్‌గా పనిచేస్తాడని తెలుసు. అంతకుమించి చారి గురించి నాకేమీ తెలియదు, తెలుసుకోవాలని కూడా ప్రయత్నించలేదు.

ఎప్పుడూ ఏదో పనిమీద తిరిగే చారిని అప్పుడప్పుడు- ఇంత పని చెయ్యడానికి మీకు టైమ్ ఎట్లా దొరుకుతుందండీ అని అనేవాణ్ణి.

టైముదేముంది సార్ అంటూ నవ్వి ఊరుకునేవాడు.

★★★

మోహన్‌రావు కదిపిన విషయంతో మనసంతా వికలమైంది.

లేచి చకచకా బట్టలు మార్చుకుని వూళ్లోకి బయలుదేరాను.

'ఎక్కడికండీ హఠాత్తుగా బయలుదేరుతున్నారు' ఏమీ చెప్పకుండా బయటికెళుతున్న నన్నుచూసి సుమిత్ర అడిగింది.

'అలా ఊళ్లోకెళ్లొస్తాను' ముక్తసరిగా చెప్పి బయటపడ్డాను.

నేను వెళ్లేసరికి ముకుందరావుగారు ఇంట్లోనే వున్నారు. యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా రిటైరైన ముకుందరావుకు తెలుగు సాహితీ రంగంలో మంచి పేరుంది. ఎన్నో రచనలు చేశారు వారు. మా ఊళ్లో జరిగే సాహితీ సభలన్నింటికీ వారు పెద్ద దిక్కు. అందరితోనూ చాలా సరదాగా మాట్లాడతారు. నన్ను చూడగానే 'మాధవరావుగారా... ఆదివారంనాడు దారి తప్పి వచ్చినట్లున్నారే' అని చిన్నగా నవ్వుతూ చేతిలో పుస్తకాన్ని పక్కనపెట్టారు.

'లేదండీ- మీ దగ్గరకే వచ్చాను' ముకుందరావు ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాను.

'చెప్పండి' అని నావైపు చూశారు ముకుందరావు.

ఉపోద్ఘాతం లేకుండానే విషయం మొత్తం చెప్పేశాను. నా పేరును, అధికారి హోదాను ఉపయోగించుకుని డబ్బు వసూలు చేసి చారి సాహితీ కార్యక్రమాలను సాహితీ వ్యాపారంగా మార్చేశాడని, డబ్బు సంపాదించేందుకు సాహిత్యాన్ని ఒక మార్గంగా ఎంచుకున్నాడని, నన్ను మోసం చేశాడని ఆవేశంగా చెప్పాను. ఇందులో నాకు కూడా వాటా వున్నట్లుగా అందరూ అనుకుంటున్నారని, అసలు చారి ఇలాంటివాడని తెలిస్తే దగ్గరకు కూడా రానిచ్చేవాడిని కాదని, ఈ విషయంలో చారినే నిలదీద్దామని అనుకున్నానని అయితే పెద్దవారిగా మిమ్మల్ని ముందుగా సంప్రదించాలనుకుని వచ్చానని చెప్పి ముగించాను. ఈ విషయాన్నంతా కోపంగాను, బాధతోను చెప్పాను.

ముకుందరావు నేను చెప్పిందంతా ఓపికగా, శ్రద్ధగా విని కాసేపు మౌనంగా వుండిపోయారు. ఈలోగా టీ తీసుకురావడంతో ఇద్దరమూ టీ తాగడంలో నిమగ్నమయ్యాం. టీ తాగిన తర్వాత కొద్దిగా బరువు దిగినట్లనిపించింది.

ముకుందరావుగారు మాట్లాడటం ప్రారంభించారు.

'మాధవరావుగారు మనలాంటి పట్టణాల్లో సభా కార్యక్రమాలు నిర్వహించడం ఎంత కష్టం. ఎంత ఖర్చుతో కూడిన విషయమో మీరు ఆలోచించకపోవడం విచారకరం. చారి ఒక్కడే కార్యక్రమాన్నంతా నెత్తిన వేసుకుని ఎందుకు చెయ్యాలి? మీకు, నాకు కూడా సాహిత్యమంటే అభిమానమే. మనమెందుకు ఆ పని చెయ్యకూడదు? ఎందుకంటే మనలాంటి వాళ్లకు అంత టైముండదు, మనందరికీ ఏవో ఇతర పనులున్నాయి కాబట్టి. ఈరోజుల్లో ఎవరు ఏ పని చేయాలన్నా అందులో మనకు ఏం లాభముంటుంది అని ఆలోచిస్తారు. ప్రతీదాన్ని ఆర్థిక దృష్టితో చూసే ఈ రోజుల్లో చారి మాత్రం నిస్వార్థంగా ఈ పనులన్నీ చేయాలని మీరెందుకనుకుంటున్నారు?

'మిమ్మల్నిగానీ, మీకు తెలిసిన వాళ్లను గానీ ఎప్పుడైనా చారి విరాళం అడిగినట్లు మీ దృష్టికి వచ్చిందా?'

రాలేదని తలూపాను.

'సాహితీ ప్రియులు తమకు తోచిన విధంగా అప్పుడప్పుడూ కొంత విరాళం ఇవ్వడం, వ్యాపార సంస్థలు తమ ప్రచార నిమిత్తం కార్యక్రమాన్ని స్పాన్సర్ చేయడం వాస్తవమే. ఇలా వచ్చిన సొమ్ము సభా కార్యక్రమం నిర్వహించడానికి, అతిథి మర్యాదలకు, ఇతరత్రా ఖర్చయిపోతూనే వుంటుంది. ఇలా వచ్చిన డబ్బులో కొంత మొత్తాన్ని చారి పట్టణంలో కార్యక్రమ పనిపై ఆయా చోట్లకు వెళ్లేందుకు వెచ్చించచ్చు. అది కూడా లేకుండా స్వంత ఖర్చుతో పనిచెయ్యమనడం ఎంతవరకు సమంజసం?'

కొన్నిచోట్ల సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో కొంతమంది డబ్బు చేసుకుంటే చేసుకోవచ్చు. జీవం కోల్పోతున్న తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాన్ని సజీవంగా వుంచుతున్న వాళ్లపై విమర్శలు చేయడం సులభం. కొంతమంది తాము చెయ్యరు, ఇతరులు చేస్తుంటే డబ్బు కోసం చేస్తున్నారని, వ్యాపారమయం చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తుంటారు. ఇందులో డబ్బు సంపాదించే అవకాశముంటే అలా అనేవారే కార్యక్రమాలు చేసి డబ్బు సంపాదించుకోవచ్చు కదా. కార్యక్రమాలు సజావుగా జరిగితేనే ఎవరైనా డబ్బిస్తారు. ఊరికే ఎవరూ ఇవ్వరు. సాహిత్యంపై అభిమానం లేకుండా ఎవరూ ఏ పని చేయరు. తర్వాతనే కొందరు కొందరు పలుకుబడి కోసం కొందరు పేరుకోసం కార్యక్రమాలు చేస్తుండవచ్చు. అక్కడక్కడా కార్యక్రమాలు జరుగుతున్నాయంటే అవి వీరి వల్లనే'

చెప్పడం ఆపి గంభీరంగా వుండిపోయారు ముకుందరావు.

'నాకు తెలిసినంతవరకు చారికి ఎలాంటి దురాలోచన లేదండీ. మాధవరావుగారూ- మీరు ఈ ఊరికి రాకముందునుండీ చారి సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. కాకపోతే మీరొచ్చిన తర్వాత మీ ప్రోత్సాహంతో కార్యక్రమాల సంఖ్య మాత్రం పెరిగింది' అని కొద్దిగా ఆగారు.

మళ్లీ ఆయనే అన్నారు.

'మీరన్నట్లు చారికి సాహితీ కార్యక్రమాలు వ్యాపారం కాదు, కేవలం వ్యాపకం మాత్రమే'

నేను ఆలోచనల్లో పడ్డాను. ఎవరో అన్న మాటలకు చారిని అనుమానించినందుకు గిల్టీగా ఫీలయ్యాను.

ఇంకేం మాట్లాడకుండా సెలవు తీసుకుని ముకుందరావు ఇంట్లోంచి బయటపడ్డాను.